సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

సోమవారం ׀ 9 ׀ సెప్టెంబర్ ׀ 2024



సుజనకోట గ్రామం వద్ద మత్స్యగెడ్డ నీటి ప్రవాహం

గ్రామాల్లోకి ఎగదన్నుతున్న మత్స్యగెడ్డ

ముంచంగిపుట్టు: మత్స్యగెడ్డ నీరు గ్రామాల్లోకి ఎగదన్నుతోంది. ఈ గెడ్డ నీరంతా జోలాపుట్టు జలాశయంలో చేరుతుంది. అయితే ప్రాజెక్ట్ నిండిపోవడంతో ఆ నీరంతా గ్రామాల్లోకి వచ్చేస్తోంది. ఆదివారం ఉదయం సుజనకోటలో మత్స్యగెడ్డ వరద నీరు ఇళ్ల వద్దకు చేరుకోవడంతో స్థానికులు భయాందోళన చెందారు. మత్స్యగెడ్డ ఉగ్రరూపం దాల్చిన నేపథ్యంలో నాటు పడవలపై ప్రయాణం చేయవద్దని, చేపల వేటకు వెళ్లవద్దని సుజనకోట పంచాయతీ పరిధిలోని గ్రామాల గిరిజనులను సర్పంచ్ వి.రమేష్ కోరారు.

న్యూస్‌రీల్

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్

సాక్షి, పాడేరు: జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ప్రభుత్వ సిబ్బంది, అధికారులు 24 గంటలు అందుబాటులో ఉంటూ ప్రజలకు అవసరమైన సహాయ, సహకారాలు అందించాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత చర్యలు చేపట్టినట్టు ఆయన తెలిపారు. భారీ వర్షాల నేపథ్యంలో పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలియజేసేందుకు కంట్రోల్ రూమ్ ఏర్పాటుచేసినట్టు ఆయన తెలిపారు. సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: 08935 29912, 08935 293448.

నేడు విద్యా సంస్థలకు సెలవు

సాక్షి, పాడేరు: ఏజెన్సీలో కురుస్తున్న భారీ వర్షాల వల్ల జిల్లా వ్యాప్తంగా అన్ని యాజమాన్య విద్యాలయాలకు సోమవారం సెలవు ప్రకటిస్తున్నట్టు కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదివారం తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలను మూసివేయాలని ఆయన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. భారీ వర్షాలు కురుస్తున్నందున జిల్లా వ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గెడ్డలు, వాగులు దాటి ప్రమాదాల బారిన పడొద్దని ఆయన సూచించారు.

ఘాట్‌రోడ్లలో వాహన రాకపోకలు నిషేధం

- కలెక్టర్ దినేష్‌కుమార్ ఉత్తర్వులు

సాక్షి, పాడేరు: జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలకు కొండ చరియలు విరిగిపడే అవకాశం ఉన్నందున ఘాట్ రోడ్లలో వాహనాల రాకపోకలు నిషేధిస్తూ కలెక్టర్ ఏఎస్.దినేషకుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. దీనిలో భాగంగా నర్సీపట్నం-సీలేరు, వడ్డాది- పాడేరు, అరకు-అనంతగిరి , రంపచోడవరం వయా మారేడుమిల్లి మీదుగా చింతూరు ఘాట్ రోడ్లలో వాహన రాకపోకలు జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు.

'పనస' గణపతి



వినాయకుని రూపంలో పనసకాయ

అరకులోయ రూరల్ : చొంపి గ్రామానికి చెందిన పూజారి దామోదర్ పొలంలో పనస చెట్టుకు వినాయకుడి ఆకారంలో కాయ కాసింది. చవితి ఉత్సవాల నేపథ్యంలో దీనిని గ్రామానికి తీసుకు రావడంతో స్థానికులు ఆసక్తిగా తిలకించారు.

కిరండూల్ నైట్ ఎక్స్‌ప్రెస్ దారి మళ్లింపు

తాటిచెట్లపాలెం: ప్రతికూల వాతావరణ పరిస్థితుల దృష్ట్యా కేకే లైన్‌లో నడిచే విశాఖపట్నం-కిరండూల్-విశాఖపట్నం(18514/18513) నైట్ ఎక్స్‌ప్రెస్ రెగ్యులర్ మార్గంలో కాకుండా విజయనగరం, రాయగడ, కోరాపుట్ మీదుగా నడుస్తుందని వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు మళ్లించిన మార్గంలో నడుస్తుందన్నారు.

కత్తులతో దాడి.. వ్యక్తికి తీవ్ర గాయాలు

- రెండు కుటుంబాల మధ్య వివాదం



తీవ్రంగా గాయపడిన గిరిజనుడు సామరా

గూడెంకొత్తవీధి: రెండు కుటుంబాల మధ్య తలెత్తిన వివాదం కత్తులతో దాడికి దారితీసింది. మండలంలోని మారుమూల చుక్కగొయ్యి గ్రామంలో ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. చుక్కగొయ్యి గ్రామంలో రెండు కుటుంబాల మధ్య శనివారం స్వల్ప వివాదం జరిగింది. ఇది ఘర్షణకు దారితీసింది. ఒకరిపై ఒకరు కత్తులతో దాడికి పాల్పడ్డారు. ఈఘటనలో గ్రామానికి చెందిన సామరాకు తలకు తీవ్రగాయాలయ్యాయి. దీనిపై పోలీసులకు సమాచారం అందడంతో వెంటనే అతనిని రాత్రికి రాత్రే కేజీహెచ్‌కు తరలించారు. దాడికి పాల్పడిన ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. బాధిత గిరిజనుడు నుంచి వాంగ్మూలం తీసుకున్న తరువాత తదుపరి చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.



మోతుగూడెం: నిండుగా డొంకరాయి జలాశయం



మోతుగూడెం: ఉధృతంగా ప్రవహిస్తున్న సీలేరు నది



గూడెంకొత్తవీధి: నీటమునిగిన వరి పొలాలు



దుంబ్రిగుడ: ఉధృతంగా ప్రవహిస్తున్న చాపరాయి గెడ్డ

వణికిస్తున్న వర్షాలు

జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు ప్రజలను వణికిస్తున్నాయి. వాగులు, గెడ్డలు పొంగి ప్రవహిస్తున్నాయి. మత్స్యగెడ్డ నీరు గ్రామాల్లోకి ఎగదన్నడంతో పరివాహక ప్రాంతంలోని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. జోలాపుట్టు, డుడుమ, డొంకరాయి తదితర జలాశయాలకు వరద తాకిడి నెలకొంది. వీటి నుంచి వేలాది క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలను అధికార యంత్రాంగం అప్రమత్తం చేసింది.



జోలాపుట్టు నుంచి డుడుమకు విడుదల అవుతున్న నీటి ప్రవాహం

- ప్రమాదస్థాయికి జలాశయాల నీటిమట్టాలు
- జోలాపుట్టు, డుడుమ, డొంకరాయి నుంచి వేలాది క్యూసెక్కులు విడుదల
- మత్స్యగెడ్డ ఉగ్రరూపంతో అవతలి గ్రామాలకు నిలిచిన రాకపోకలు
- ఘాట్ మార్గాల్లో విరిగిపడుతున్న కొండ చరియలు
- వాహన రాకపోకలు నిలిపివేసిన అధికార యంత్రాంగం

సాక్షి,పాడేరు: జిల్లాలో శనివారం రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు జనజీవనం స్తంభించింది. జి.మాడుగుల, పాడేరు, పెదబయిలు, ముంచంగిపుట్టు మండలాల మీదుగా ప్రవహించే మత్స్యగెడ్డ ఉగ్రరూపం దాల్చింది. రాయగడ, పరదానపుట్టు కాజువేల పైనుంచి పొంగి ప్రవహిస్తుండటంతో పాడేరు, పెదబయలు మండలాల్లోని సుమారు వంద గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఇక్కడికి సమీపంలోని బుంగగెడ్డ, చిలకలమామిడి గెడ్డ, దిగుమోదాపుట్టు గెడ్డలు ప్రమాదకరంగా ప్రవహిస్తున్నాయి. అరకులోయ, అనంతగిరి, పాడేరు, లంబసిగి ఘాట్ మార్గాల్లో కొండచరియలు విరిగి పడుతున్నందున జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఆదివారం సాయంత్రం నుంచి ఘాట్ ప్రాంతాల్లో రాకపోకలు నిలిపివేసింది.

దుంబ్రిగుడ: వర్షాలకు చాపరాయి జలపాతం ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో చాపరాయి జలవిహారిని ఆది, సోమవారం మూసివేయాలని కలెక్టర్ దినేష్‌కుమార్, పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశాలు జారీ చేశారు. మండలంలోని గుంటగన్నేల పంచాయతీ కోరంజిగుడలో సోమేలి బుల్లు అనే గిరిజనుడి ఇంటిపై జీలుగుచెట్టు కూలడంతో పైకప్పు ధ్వంసమైంది.

కొయ్యూరు: మండలంలోని కొయ్యూరు కాలువ ఉధృతంగా ప్రవహిస్తోంది. నల్లగొండ- పెదమాకవరం మధ్య నిర్మించిన కాజ్‌వే కొట్టుకుపోయింది. కృష్ణదేవిపేటతోపాటు 30 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.



కొయ్యూరు: ఉధృతంగా ప్రవహిస్తున్న కొయ్యూరు కాలువ



పెదబయలు: పరదానిపుట్టు కాజ్‌వేపైనుంచి ప్రవహిస్తున్న మత్స్యగెడ్డ

అడ్డతీగల: మండలంలో మడేరు, కన్నేరు వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో అవతలి గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి

గూడెంకొత్తవీధి: మండలంలో వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. మండల కేంద్రంలోని లోతట్టు ప్రాంతాల్లోని 30 ఎకరాల్లో వరి పొలాలు నీటమునిగాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

వాహన రాకపోకలు నిలిపివేత

సీలేరు: అటవీప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలకు కొండచరియలు విరిగి రోడ్లపైకి వచ్చే అవకాశం ఉన్నందున అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాల మేరకు ధారకొండ, లంబసింగి ఘాట్ మార్గాల్లో వాహన రాకపోకలు నిలిపి వేశారు.

ఆర్టీసీ సర్వీసులు రద్దు

ధారకొండ, లంబసింగి ఘాట్ మార్గాలు మూసివేయడంతో విశాఖ నుంచి సీలేరు మీదుగా భద్రాచలం వెళ్లే పగలు, రాత్రి బస్సు సర్వీసులు రద్దు చేసినట్టు ఆర్టీసీ అధికారవర్గాలు తెలిపాయి. పాడేరు నుంచి భద్రాచలం వెళ్లే బస్సులను కూడా రద్దు చేశామని వారు పేర్కొన్నారు.

పెదబయలు: గిన్నెలకోట, జామిగుడ, గుల్లేలు



పాడేరు: అంబేడ్కర్ సెంటర్‌లో కురుస్తున్న వర్షం

గెడ్డలు పొంగి ప్రవహిస్తున్నాయి. పెదకోడాపల్లి పంచాయతీ పరదానిపుట్టు సమీపంలో మత్స్యగెడ్డ వరదనీరు కాజ్‌వేపై నుంచి ప్రవహిస్తోంది. కిముడుపల్లి పంచాయతీ చేదుపుట్టు వద్ద గేదెగెడ్డ పరవళ్లు తొక్కుతోంది. జామిగుడ, గిన్నెలకోట, గుల్లేలు,ఇంజరి పంచాయతీల్లోని గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి.

మోతుగూడెం: సీలేరు ప్రాజెక్ట్ పరిధిలో గుంటవాడ, డొంకరాయి జలాశయాలు పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరుకున్నాయి. సీలేరు, డొంకరాయి, పొల్లూరు జలవిద్యుత్ కేంద్రాల్లో రోజుకు నాలుగు మిలియన్ యూనిట్ల మేర పూర్తిస్థాయిలో విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నట్లు జెన్‌కో అధికారులు తెలిపారు. డొంకరాయి జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 1037 అడుగులు. ప్రస్తుతం 1036 అడుగులకు చేరుకోవడంతో ఆదివారం సాయంత్రం నుంచి నాలుగు గేట్ల ద్వారా సుమారు 16 వేల క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. పరిసర ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని రెవెన్యూ, ఐటీడీఏ అధికారులకు సమాచారం అందించినట్టు జెన్‌కో అధికారవర్గాలు తెలిపాయి. పొల్లూరు జలపాతం పరవళ్లు తొక్కుతోంది. సీలేరు నది ఉధృతంగా ప్రవహిస్తోంది.

జోలాపుట్టు, డుడుమకు భారీగా వరదనీరు

ముంచంగిపుట్టు: ఆంధ్రా-ఒడిశా రాష్ట్రాలు ఉమ్మడిగా నిర్వహిస్తున్న మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రానికి నీరందించే ప్రధాన డుడుమ, జోలాపుట్టు జలాశయాలకు వరద నీరు పోటెత్తింది. దీంతో నీటిమట్టాలు ప్రమాదస్థాయికి చేరుకున్నాయి. జలాశయాల గేట్లపై నుంచి నీరు వెళ్లిపోతుండడంతో సిబ్బంది అప్రమత్తం అయ్యారు. డుడుమ జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 2,590 అడుగులు కాగా ఆదివారం నాటికి 2,587.20 అడుగులుగా నమోదయింది. దీంతో అప్రమత్తమైన జలాశయ సిబ్బంది 3,5,7 నంబర్ల గేట్లను ఎత్తి 13వేల క్యూసెక్కులను దిగువన ఉన్న బలిమెల జలాశయానికి విడుదల చేస్తున్నారు. ఈ జలాశయానికి ఎగువన ఉన్న జోలాపుట్టు జలాశయ నీటి మట్టం కూడా ప్రమాద స్థాయికి చేరుకుంది. దీని నీటి సామర్థ్యం 2,750 అడుగులు కాగా ఆదివారం నాటికి 2,748 అడుగుల మేర నీటి నిల్వ ఉంది. దీంతో అప్రమత్తమైన జలాశయ సిబ్బంది ఒడిశా స్పిల్‌వే నుంచి 16 వేలు, జోలాపుట్టు ప్రధాన జలాశయం నుంచి రెండు వేల క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టకపోవడంతో వరద ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉంది. దీంతో ప్రాజెక్ట్ సిబ్బంది నిత్యం పర్యవేక్షిస్తూ తగు చర్యలు తీసుకుంటున్నారు.





రంపచోడవరం: భూపతిపాలెం, ముసురుమిల్లి ప్రాజెక్టుల నుంచి విడుదలవుతున్న వరద నీరు

రంపచోడవరం: ఏజెన్సీలో వర్షాలకు సాగునీటి ప్రాజెక్టులైన భూపతిపాలెం, ముసురుమిల్లి, సూరంపాలెం జలాశయాల్లో భారీగా వరద నీరు చేరుతోంది. ముసురుమిల్లి ప్రాజెక్టు నుంచి ఏడు గేట్ల ద్వారా 300 క్యూసెక్కుల నీరు దిగువకు ప్రవహిస్తోంది. భూపతిపాలెం ప్రాజెక్టులో 400 క్యూసెక్కులు వరదనీరు చేరుతోంది. అదే స్థాయిలో రెండు గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తున్నారు. సూరంపాలెం ప్రాజెక్టు ద్వారా వెయ్యి క్యూసెక్కుల దిగువకు విడుదల చేస్తున్నారు.

ప్రమాదం అంచున వంతెన

ముంచంగిపుట్టు: మండలంలోని జోలాపుట్టులో ఆంధ్రా-ఒడిశా రాష్ట్రాల ప్రజలు కాలినడకన రాకపోకలు సాగించే ఐరన్ వంతెనకు ప్రమాదం పొంచి ఉంది. జోలాపుట్టు జలాశయం స్పిల్‌వే నుంచి నుంచి 13 వేల క్యూసెక్కుల నీరు ఒకేసారి విడుదల చేయడంతో వంతెనను తాకుతూ ప్రవహిస్తోంది. 2006లో స్పిల్‌వే నుంచి విడుదలైన వరదనీటి ఉధృతికి కర్రల వంతెన కొట్టుకుపోయింది. ఆ తరువాత తాత్కాలికంగా ఐరన్ వంతెన నిర్మించారు. ఇప్పుడు కూడా గతంలో మాదిరిగానే జోలాపుట్టు స్పిల్‌వే నుంచి భారీగా వరద నీరు విడుదల చేస్తున్నారు. దీనివల్ల వంతెనకు నష్టం జరిగే పరిస్థితులు కనిపిస్తున్నాయని ఇరు రాష్ట్రాల సరిహద్దు గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



జోలాపుట్టులో ఐరన్ వంతెనను తాకుతూ ప్రవహిస్తున్న ప్రాజెక్ట్ వరద నీరు



సీలేరు: ఎడతెరిపిలేని వర్షాల కారణంగా నిలిచిపోయిన ఆర్టీసీ బస్సులు



పెదబయలు: గేదెగెడ్డ కాజ్‌వేపై ప్రవహిస్తున్న వరద నీరు



అడ్డతీగల: పైడిపుట్టు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న కన్నేరువాగు



రాజవొమ్మంగి: జడ్డంగి వద్ద మడేరు ఆనకట్టపై నుంచి వరద ప్రవాహం



మోతుగూడెం: ఉధృతంగా ప్రవహిస్తున్న చీకటివాగు

ముంచంగిపుట్టులో అత్యధిక వర్షపాతం

సాక్షి,పాడేరు: జిల్లాలో అత్యధికంగా ముంచంగిపుట్టులో 97.8 మిలీమీటర్లు, అత్యల్పంగా వీఆర్‌పురంలో 10.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. పెదబయలులో 47.0, దుంబ్రిగుడలో 37.4, అరకులోయలో 23.0, అనంతగిరిలో 15.2, హుకుంపేటలో 34.0, పాడేరులో 35.8, జి.మాడుగులలో 22.6, చింతపల్లిలో 68.4, జీకే.వీధిలో 46.2, కొయ్యూరులో 26.2, మారేడుమిల్లిలో 44.2, దేవీపట్నంలో 29.4, వై.రామవరంలో 76.8, అడ్డతీగలలో 70.4, రాజవొమ్మంగిలో 56.0, గంగవరంలో 76.4, రంపచోడవరంలో 39.4, ఎటపాకలో 16.8, కూనవరంలో 15.4, చింతూరులో 10.2 మిల్లీమీటర్ల వర్షపాతం ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు నమోదైంది.

నేటి ఐటీడీఏ గ్రీవెన్స్ రద్దు

రంపచోడవరం: భారీ వర్షాల కారణంగా సోమవారం జరగవలసిన ప్రజా సమస్యల వేదిక రద్దు చేసినట్లు ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం తెలిపారు. వర్షాల వల్ల ఏమైనా సమస్యలు ఉంటే దగ్గర్లోని మండల అధికారులకు, ఐటీడీఏ, సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌కు సమాచారమివ్వాలన్నారు. వర్షాలకు కొండ కాలువలు పొంగి ప్రవాహిస్తున్నాయని, ఎట్టి పరిస్థితుల్లో వాటిని దాటి రావద్దని తెలిపారు. వర్షాలకు సంబంధించి ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ 9492920383, 6303269069, 9441058467 నంబర్లకు సంప్రదించాలని ఆయన కోరారు.

ఎమ్మెల్యే చొరవతో బైకిస్ట్‌కు తప్పిన ప్రమాదం

- గెడ్డలో కొట్టుకుపోతుండగా రక్షించేందుకు ప్రయత్నించిన విశ్వేశ్వరరాజు
- తాడు సాయంతో ఒడ్డుకు చేర్చిన ఈ.కొత్తూరు, బొక్కేల ప్రజలు

సాక్షి, పాడేరు: మండలంలోని రాయగడ్డ కాజ్‌వేపై వరద ఉధృతిలో కొట్టుకుపోతున్న బైకిస్ట్‌ను పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు ప్రాణాలకు తెగించి కాపాడే ప్రయత్నం చేశారు. గెడ్డ మధ్యలో బైక్‌తో పాటు కొట్టుకుపోతున్న ఈ బైకిస్ట్‌ను దూరం నుంచి చూసిన ఎమ్మెల్యే గెడ్డలో దిగి బయటకు లాగే ప్రయత్నం చేసినప్పటికీ, సదరు బైకిస్ట్ తన బండిని వదలకపోవడంతో దిగువకు కొట్టుకుపోయాడు. ఎమ్మెల్యే కేకలతో ఈ.కొత్తూరు, బొక్కేల ప్రజలు బైకిస్ట్‌ని అష్టకష్టాలు పడి తాడు సాయంతో ఒడ్డుకు చేర్చారు. ఎమ్మెల్యే కూడా ఈ గెడ్డ ఉధృతి నుంచి సురక్షితంగా బయటపడి తన ప్రాణాలు కాపాడుకున్నారు. ఇదంతా ఆదివారం సాయంత్రం పాడేరు మండలం బొక్కేలు కాజ్‌వేపై చోటు చేసుకుంది. విశాఖపట్నంలోని మర్రిపాలేనికి చెందిన ఈ బైకిస్ట్ గుండేలి గ్రామంలోని ఓ గిరిజన యువతిని వివాహం చేసుకున్నాడని స్థానిక గిరిజనులు చెబుతున్నారు. భారీ వర్షంతో కాజ్‌వే మీదుగా మత్యగెడ్డ ఉధృతంగా ప్రవహిస్తున్న సమయంలో బైకిస్ట్ గెడ్డను దాటే ప్రయత్నం చేసి ప్రమాదం కొనితెచ్చుకున్నాడు. గెడ్డ ఉధృతిని పరిశీలించేందుకు వచ్చిన పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు స్థానిక గిరిజనుల చొరవతో బైకిస్టు ప్రాణాలతో ఒడ్డుకు చేరుకున్నాడు.



గెడ్డలో కొట్టుకు పోతున్న బైకిస్ట్‌ను కాపాడే ప్రయత్నం చేస్తున్న ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు

సీఏపీఎఫ్‌లో ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోండి

కొయ్యూరు: కేంద్ర ఆర్మ్‌డ్ పోలీసు ఫోర్స్ (సీఏపీఎఫ్)లో ఉద్యోగాలకు 18 నుంచి 23 సంవత్సరాల వయసు గల అభ్యర్థులు వచ్చేనెల 14వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సీఐ వెంకటరమణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్టీలకు ఐదు సంవత్సరాల వయసు మినహాయింపు ఉందన్నారు. గ్రామసచివాలయాల్లో మహిళా పోలీసులకు దరఖాస్తులను అందజేయవచ్చన్నారు. స్టాఫ్ సెలక్షన్ కమిషన్ నిర్వహిస్తున్న ఈ పోటీ పరీక్షను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఎస్టీలు ఎలాంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. కంప్యూటర్ బేస్‌డ్ పరీక్ష(సీబీఈ)లో ఉత్తీర్ణత సాధించిన అనంతరం శారీరక ధారుఢ్య పరీక్షల్లో కూడా ఉత్తీర్ణత సాధించాలన్నారు. విద్యార్హత,ఆధార్, ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేయాలని ఆయన సూచించారు.ఆసక్తి గల వారు పూర్తి వివరాలకు సంబంధిత పోలీసుస్టేషన్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

ఘనంగా చవితి ఉత్సవాలు



పెదబయలు: మత్స్యగెడ్డలో గణపతి విగ్రహాన్ని నిమజ్జనం చేస్తున్న భక్తులు

- వాడవాడలా మండపాలు
- భక్తిశ్రద్ధలతో పూజలు
- పల్లెలు, పట్టణాల్లో సందడి



ప్లకార్డులతో అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

సాక్షి, పాడేరు/ముంచంగిపుట్టు/పెదబయలు: జిల్లా వ్యాప్తంగా వినాయక చవితి ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. జిల్లా కేంద్రమైన పాడేరులో గణపతి మండపాలు ఏర్పాటుచేసి నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తుండటంతో సందడి నెలకొంది.

ఆకట్టుకున్న చాక్లెట్ గణపతి

మండలకేంద్రమైన ముంచంగిపుట్టులో కొమ్ము సాయికుమార్, శేషవితభవాని రూ.15వేలతో మూడు అడుగుల పొడవున ఏర్పాటుచేసిన 25 కిలోల చాక్లెట్ వినాయకుడు ఆకట్టుకుంటున్నాడు. ఉత్సవాల ముగింపు తేదీ 14తేదీన విగ్రహాన్ని పాలతో నిమజ్జనం చేస్తామని వారు తెలిపారు.



చాక్లెట్ వినాయకుడు

పెదబయలు: వినాయక చవితి సందర్భంగా మండల కేంద్రంలో పూజలు అందుకున్న గణపతి విగ్రహాన్ని ఇక్కడికి సమీపంలో మత్స్యగెడ్డలో ఆదివారం నిమజ్జనం చేశారు.

మత్స్యగెడ్డను కలుషితం చేయొద్దు

వినాయక నిమజ్జనంలో భాగంగా మత్స్యగెడ్డలో ప్లాస్టిక్ ప్లాస్టిక్, పాలిథిన్ వ్యర్థాలను వేయవద్దని పెదబయలు గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాల-1 విద్యార్థులు సూచించారు. ఆ పాఠశాల ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో వారు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత, మత్స్యగెడ్డను కలుషితం కాకుండా చూడాలని ప్లకార్డులతో ప్రదర్శన నిర్వహించారు.

మెనూ అమలులో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



గన్నెలలో బాలికల వసతి గృహంలోని రికార్డులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం



లోతేరులోని బాలురు పాఠశాలలోని వంట గదిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

అరకులోయ రూరల్: విద్యార్థుల మెనూ అమలులో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని అరుకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం హెచ్చరించారు. మండలంలో మారుమూల లోతేరు గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాల వసతి గృహం, గన్నెల గిరిజన సంక్షేమ బాలికల వలసతి గృహలను ఆయన ఆదివారం ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థుల హాజరుపట్టిక, స్టాక్ రిజిష్టర్‌లను తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న మోను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మత్స్యలింగం మాట్లాడుతు చిన్నారుల విద్య, ఆరోగ్యంపై వసతి గృహాల నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం మెనూ అమలులో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయా వసతి గృహాలు, పాఠశాలల్లో పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడంపై నిర్వాహకులపై ఎమ్మెల్యే మత్స్యలింగం ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిసరాలు అపరిశుభ్రతతో వ్యాధులు ప్రబలుతాయన్నారు. ఇకపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉపాధ్యాయులు బాధ్యతతో మెలిగి విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలని, సమయపాలన పాటించాలన్నారు. విద్యార్థుల ఉన్నత భవిష్యత్‌కు బాటలు వేయాలన్నారు. పాఠశాలల్లో ఎక్కువ మంది విద్యార్థులు చేరేలా చూడాలని సూచించారు. అనంతరం గన్నెల ప్రాథమిక ఆర్యోగ కేంద్రంని సందర్శించారు. సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండి ప్రజలకు వైద్యసేవలు అందించాలని సూచించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీరామ్, నొబొ తదితరులున్నారు.

వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండండి

- జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర

మహారాణిపేట: బంగాళాఖాతంలో వాయుగుండం నేపథ్యంలో ఉమ్మడి విశాఖ జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర సూచించారు. అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని సూచించారు. భారీ వర్షాల వల్ల వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయని ముఖ్యంగా గిరిజన ప్రాంతంలో గెడ్డలు భారీ ఎత్తున ప్రవహిస్తున్నాయని ప్రజలు ఎవరూ గెడ్డలు దాటవద్దని చెప్పారు. పశువులు, మేకలు వారి వారి పాకల్లోనే ఉంచుకునేలా రైతులు జాగ్రత్తలు పడాలని పేర్కొన్నారు. సాధ్యమైనంత వరకు చెట్ల కింద ఉండొద్దని ప్రజలకు సూచించారు. పిడుగులు పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో ఈ జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. గజనాథుని ఉత్సవాలు జరుగుతున్నాయని నిమజ్జన సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

చీడిపుట్టు వంతెనపై రాకపోకలు నిలిపివేత

- సబ్‌కలెక్టర్ సౌర్యమన్ పటేల్

హుకుంపేట: గెడ్డలు, వాగులు ప్రవహిస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సబ్‌కలెక్టర్ సౌర్యమన్ పటేల్ కోరారు. ఆదివారం మండలంలోని చీడిపుట్టు వంతెనను సందర్శించారు. ఈ వంతెనపై రాకపోకలు నిలిపివేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మరో 24గంటలు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.



చీడిపుట్టు వంతెనను సందర్శించిన సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్

బుడి బుడి అడుగులు వేయాల్సిన వయసులోనే బ్రేక్ డ్యాన్స్‌తో అదరగొట్టిన కార్తికేయ రెడ్డి.. ఇప్పుడు అంతర్జాతీయ వేదికలను షేక్ చేస్తున్నాడు. వినాయక చవితి పందిరి వద్ద తొలిసారి డ్యాన్స్ చేసిన ఈ బుడ్డోడు.. మోడలింగ్ రంగంలోనూ అడుగుపెట్టి ర్యాంప్‌లపై రాక్ చేస్తున్నాడు. తాజాగా థాయ్‌లాండ్‌లో జరిగిన జూనియర్ మోడల్ ఇంటర్నేషనల్(జేఎంఐ) పోటీల్లో భారతదేశం నుంచి ప్రాతినిథ్యం వహించి 'ప్రిన్స్ వరల్డ్–2024'టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. 4వ తరగతి చదువుతున్న కార్తికేయ రెడ్డి వ్యాఖ్యానం, నటన, కథలు చెప్పడం, యోగా ఇలా అనేక రంగాల్లో ప్రతిభ చూపిస్తూ బహుముఖ ప్రజ్ఞాశాలిగా పేరొందాడు. చిన్న వయసులోనే ఎన్నో అవార్డులు గెలుచుకుని తన ప్రతిభను చాటుతున్నాడు. –సీతమ్మధార

సకల కళా కార్తికేయ

- బుడి బుడి అడుగుల వయసులోనే బ్రేక్ డ్యాన్సులు
- మోడలింగ్‌లో అంతర్జాతీయ వేదికలపై మెరుపులు
- వ్యాఖ్యానం, నటన, యోగా రంగాల్లో రాణింపు





అవార్డులతో కార్తికేయరెడ్డి

థాయ్‌లాండ్‌లో 'ప్రిన్స్'కిరీటం



థాయ్‌లాండ్‌లో ప్రదర్శన ఇస్తున్న కార్తికేయ

రాష్ట్ర స్థాయిలో జరిగిన స్టార్ కిడ్స్ సీజన్–2లో కార్తికేయ రెడ్డి సత్తా చాటాడు. ఆంధ్రా ఫ్యాషన్ వీక్ పోటీల్లో విజేతగా నిలిచాడు. కాలికట్‌లో జరిగిన జాతీయ స్థాయి మోడలింగ్ పోటీల్లో విజయం సాధించాడు. ప్రిన్స్ ఆఫ్ ఏపీ సబ్ టైటిల్‌ను గెలిచి అంతర్జాతీయ పోటీలకు అర్హత సాధించాడు. ఇటీవల థాయ్‌లాండ్‌లో జూనియర్ మోడల్ ఇంటర్నేషనల్ పేరుతో పోటీలు నిర్వహించగా.. 11 దేశాల నుంచి 45 మంది చిన్నారులు పోటీ పడ్డారు. ఇందులో భారత్ నుంచి ప్రాతినిథ్యం వహించిన కార్తికేయ విశాఖ ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయిలో ఎగురవేశాడు. ఈ పోటీల్లో ప్రిన్స్ వరల్డ్–2024 టైటిల్‌ను గెలుచుకున్నాడు. డ్యాన్స్, మోడలింగ్ రంగంలో సత్తా చాటుతున్న కార్తికేయ ఐపీఎస్ కావడమే తన లక్ష్యమని 'సాక్షి'కి చెప్పాడు.

ఇద్దరూ ఇద్దరే

అక్కా తమ్ముళ్లు ఇద్దరూ ఇద్దరే.. తమ్ముడు కార్తికేయ రెడ్డి డ్యాన్స్, మోడలింగ్‌లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నాడు. నారాయణ స్కూల్‌లో 7వ తరగతి చదువుతున్న శ్రేయసి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించుకుంది. 34 శ్లోకాల సమాహారమైన 'శ్యామల దండకం' వల్లించినందుకు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో పేరు నమోదైంది. చిత్రలేఖనంతో పాటు పాటల పోటీల్లో అనేక బహుమతులు గెలుచుకుంది. 2024లో ఉగాది ప్రతిభా పురస్కారం అందుకుంది.

రెండేళ్లకే బ్రేక్ డ్యాన్స్‌లు : బుడి బుడి అడుగులు వేసే రెండేళ్ల వయసులోనే కార్తికేయ బ్రేక్ డ్యాన్స్‌లతో అదరగొట్టాడు. గాజువాకలో లెజెండ్ అపార్టుమెంట్‌లో వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించారు. ఆ సమయంలో రెండో ఏటలో అడుగు పెట్టిన కార్తికేయ తొలిసారిగా చేసిన డ్యాన్స్‌కు అపార్ట్‌మెంట్ వాసులంతా ఫిదా అయిపోయారు. కొన్నాళ్లకు ప్లే స్కూల్‌లో అడుగుపెట్టాడు. అక్కడ పిల్లలందరూ ఏడుస్తూ ఉంటే.. ఈ చిచ్చర పిడుగు మాత్రం డ్యాన్సులతో దుమ్ములేపేవాడు. దీంతో తల్లిదండ్రులు కార్తికేయను మంచి డ్యాన్సర్‌ను చేయాలని నిర్ణయించుకున్నారు. అయితే మూడో ఏట కాలికి శస్త్రచికిత్స అవడంతో ఏడాది పాటు డ్యాన్స్‌కు దూరమైన ఈ చిన్నోడు.. పడిలేచిన కెరటంలా మళ్లీ డ్యాన్స్ ఫ్లోర్ ఎక్కాడు. పాశ్చాత్య నృత్యాన్ని అభ్యసించాడు.

బహుముఖ ప్రజ్ఞాశాలి

ప్రస్తుతం టింపనీ స్కూల్‌లో 4వ తరగతి చదువుతున్న కార్తికేయ బహుముఖ ప్రజ్ఞాశాలిగా విద్యతో పాటు అనేక రంగాల్లో ప్రతిభ కనబరుస్తున్నాడు. స్కూల్‌లో జరిగే కల్చరల్ కార్యక్రమాల్లో వ్యాఖ్యాతగా వ్యవహరిస్తూ.. తన వాక్చాతుర్యంతో అందరినీ అలరిస్తున్నాడు. ఆయన నటించిన అల్లూరి సీతారామరాజు ఏకపాత్రాభినయానికి అందరూ మంత్రముగ్ధులయ్యారు. రాగయుత్తంగా శ్లోకాలు, గీతాలు పాడి అందరి అభినందనలు అందుకున్నాడు. ఫ్యాషన్ షోలో కూడా అందరినీ ఆకట్టుకుంటున్నాడు. దీంతో అతని తల్లిదండ్రులు మోడలింగ్ రంగంలోనూ కార్తికేయను ప్రోత్సహిస్తున్నారు. ఒక వైపు డ్యాన్సర్‌గా.. మరో వైపు మోడల్‌గా పలు రాష్ట్రాల్లో షోలు చేస్తూ గుర్తింపు తెచ్చుకున్నాడు.

తల్లిదండ్రుల ప్రోత్సాహం

కార్తికేయ రెడ్డి తండ్రి బి.జె.శ్రీనివాసరెడ్డి ఇంజినీర్స్ ఇండియా లిమిటెడ్‌లో అసిస్టెంట్ జనరల్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. ఖాళీ సమయంలో కథలు, కవితలు, వెబ్ పేజీలకు ఆర్టికల్స్ రాస్తుంటారు. ప్రతి ఆదివారం అనకాపల్లి జిల్లా పరవాడలోని ఎకరా పొలంలో సేంద్రియ వ్యవసాయం చేస్తుంటారు. కల్తీ లేని ఆహారం అందించాలన్న లక్ష్యంతో డ్రాగన్ ఫ్రూట్, మామిడి, బొప్పాయి, స్టార్ ఫ్రూట్, లిచీతో పాటు తేనెటీగల పెంపకం చేస్తుంటారు. ఆయన తల్లి పావనీ లత భారత్ హెవీ ఎలక్ట్రికల్ లిమిటెడ్ (బీహెచ్‌ఈఎల్)లో ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. ఆమె చిత్రకారిణి. కార్తికేయ రెడ్డి ఫ్యాషన్ షోల్లో వేసుకునే దుస్తులు, ఇతర వస్తువులను ఆమే డిజైన్ చేస్తుంటారు. షీలానగర్ ప్రాంతంలో నివాసముంటున్న ఈ దంపతులకు హరి శ్రేయసి రెడ్డి, కార్తికేయ రెడ్డి అనే ఇద్దరు పిల్లలున్నారు. పిల్లలకు ఆసక్తి ఉన్న రంగాల్లో ఉన్నత స్థాయికి తీసుకెళ్లేలా తల్లిదండ్రులిద్దరూ ప్రోత్సహిస్తున్నారు. ఈ కుటుంబం తమ సమయాన్ని సమర్థవంతంగా వినియోగించుకుంటూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారు.



తల్లిదండ్రులతో కార్తికేయ, శ్రేయసి

37 మద్యం సీసాలు స్వాధీనం

మునగపాక : అనుమతులు లేకుండా అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్టు అందిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ ప్రసాదరావు తన సిబ్బందితో శనివారం దాడి జరిపారు. ఇద్దరు వ్యక్తులు అనధికారికంగా మద్యం విక్రయిస్తున్నట్టు గుర్తించి వారి నుంచి 37 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



జోలాపుట్టు ప్రాజెక్ట్ సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్ఐ రవీంద్ర

ముంచంగిపుట్టు: జోలాపుట్టు,డుడుమ జలాశయాల నుంచి నీటి విడుదల నేపథ్యంలో పరిసర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ రవీంద్ర సూచించారు.ఆదివారం జోలాపుట్టు వెళ్లిన ఆయన ప్రాజెక్ట్ సిబ్బందితో మాట్లాడారు. ప్రాజెక్ట్‌ల చేరుతున్న వరద నీటి వివరాలను తెలుసుకున్నారు. నీటి విడుదల వల్ల రంగబయలు, వనుగుమ్మ, జోలాపుట్టు, దొడిపుట్టు పంచాయితీల్లో గ్రామాలకు ఎదురయ్యే సమస్యలను తెలుసుకున్నారు. మత్స్యగెడ్డ పరివాహక ప్రాంతాల ప్రజలు చేపలవేటకు వెళ్లవద్దని ఆయన సూచించారు. అత్యవసరమైతే వెంటనే తమను సంప్రదించాలని ఆయన కోరారు.

ఏవోబీలో ప్రకృతి అందాలు అద్భుతం

- సినీ డైరెక్టర్ క్రిష్
- మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రం సందర్శన



మాచ్‌ఖండ్‌లో వించ్ హౌస్ పనితీరుపై తెలుసుకుంటున్న సినిమా డైరెక్టర్ క్రిష్

ముంచంగిపుట్టు: ఆంధ్ర ఒడిశా రాష్ట్రాల సరిహద్దులో ప్రకృతి అందాలు అద్భుతంగా ఉన్నాయని ప్రముఖ సినీ డైరెక్టర్ క్రిష్ (జాగర్లమూడి రాధాకృష్ణ) అన్నారు. మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రం, డుడుమ జలపాతం, జలాశయం, వించ్‌హౌస్‌లను శనివారం ఆయన బృందంతో సందర్శించారు. ప్రాజెక్ట్ అధికారులతో మాట్లాడి పూర్తి సమాచారం తెలుసుకున్నారు. వించ్ హౌస్ పనితీరును తెలుసుకున్న ఆయన మంత్రముగ్ధులయ్యారు. ఈ ప్రాంతంలో చిత్రీకరణకు అనుమతులపై వారితో చర్చించారు.ఈ సందర్భంగా క్రిష్ మాట్లాడుతూ వించ్‌లో ప్రయాణం మధుర అనుభూతి ఇచ్చిందన్నారు. ఏడు దశాబ్దాల క్రితం ఇంజినీర్ల ఆలోచన విధానం, పనితీరుకు వించ్‌హౌస్ అద్దం పడుతోందన్నారు. ఇప్పటికీ చెక్కుచెదరని నిర్మాణం నాటి నాణ్యత ప్రమాణాలకు సాక్ష్యంగా నిలుస్తోందన్నారు. మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రంలో సినిమా చిత్రీకరణకు ఏపీ జెన్‌కో నుంచి అనుమతి పొందాల్సి ఉందన్నారు. సరిహద్దు ప్రాంతంలో ప్రకృతి అందాలు, ఆదివాసీల సంప్రదాయాలు ఎంతగానో నచ్చాయన్నారు. అనుమతులు వచ్చిన వెంటనే మాచ్‌ఖండ్ పరిసర ప్రదేశాల్లో సినిమా చిత్రీకరణ మొదలు పెడతామన్నారు. ఒడిశాలోని కోరాపుట్టు జిల్లాలో పలు ప్రదేశాలలో ఇటీవల ప్రముఖనటి అనుష్కశెట్టితో ఆయన సినిమాలోని కొన్ని సన్నివేశాలు చిత్రీకరించారు. త్వరలో మాచ్‌ఖండ్ పరిసర ప్రాంతాల్లో అదే సినిమాకు సంబంధించి మరికొన్ని సన్నివేశాలు చిత్రీకరించే అవకాశం ఉందని తెలిసింది.

విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడపాలి



మాట్లాడుతున్న స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు అయోధ్యరామ్

డాబాగార్డెన్స్: స్టీల్‌ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంతో నడిపించేలా నిర్ణయం తీసుకోవాలని స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు జె అయోధ్యరాము, ప్రధాన కార్యదర్శి యు రామస్వామి కోరారు. మంగళవారం నిర్వహించే స్టీల్ మంత్రిత్వశాఖ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకోవాలన్నారు. ఆదివారం జగదాంబ జంక్షన్ సమీపాన గల సిటూ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్‌లో ఉత్పత్తి తగ్గించి, ప్లాంట్ కోలుకోలేని దెబ్బ తీయాలని కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నిందని ఆరోపించారు.

స్టీల్‌ప్లాంట్‌లో ఉత్పత్తి చేసేందుకు 5 ఫర్నేస్‌లు ఉండగా ఒకటి మాత్రమే నడపాలని కేంద్ర బీజేపీ ప్రభుత్వం నిర్ణయించిందని, ఇది అత్యంత ప్రమాదకరమని, ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకుని, పూర్తి సామర్థ్యంతో నడిపే విధంగా కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలన్నారు. ఉత్పత్తి తగ్గించే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, ప్రవేటీకరణ ఆపి, సెయిల్‌లో విలీనం చేయాలని, పూర్తి సామర్థ్యంతో ప్లాంట్ నడపాలని తదితర డిమాండ్లు చేస్తూ మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా రాస్తారోకోలు చేపట్టనున్నట్టు వారు తెలిపారు.

కోతుల దాడిలో 10 మందికి గాయాలు

బుచ్చెయ్యపేట: మండలంలోని వడ్డాది మేజరు పంచాయతీలో కోతులు దాడి చేసి పది మందిని గాయపరిచాయి. శని, ఆదివారాల్లో దొండా వారి పాత మేడ దగ్గర గ్రామానికి చెందిన మజ్జి రేవతి, సయ్యపురెడ్డి జయమ్మ, సుంకరి దినేష్, చిట్టెమ్మ, మాలిన వరలక్ష్మి, అమరపిన్ని ప్రియాంక, చింతల సూర్యకాంతం తదితరులను గాయపరిచాయి. లోపూడిలో బండి కావేరమ్మను కోతి కరవడంతో వీరంతా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

జర్నలిస్టుల పిల్లలకు క్యాన్సర్ నియంత్రణ వ్యాక్సిన్లు

మహారాణిపేట: జిల్లాలో ఆర్థికంగా వెనుకబడిన ప్రింట్, ఎల్రక్టానిక్ మీడియా జర్నలిస్టుల కుటుంబాలకు చెందిన 9 నుంచి 14 ఏళ్లలోపు ఆడ పిల్లలకు హ్యూమన్ పాపిల్లోమా వైరస్ (హెచ్‌పీవీ) నిరోధక వ్యాక్సిన్ వేయించేందుకు చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ షిరీన్ రెహమాన్ ముందుకొచ్చారు. సుమారు రూ.4 వేల విలువ చేసే ఈ వ్యాక్సిన్‌ను రెండు డోసుల్లో తొలి దశలో 50 మంది ఆడపిల్లలకు ఉచితంగా అందిస్తారు. ఆడ పిల్లలు పెద్దయ్యాక గర్భాశయ క్యాన్సర్‌ను నిరోధించడంలో ఈ వ్యాక్సిన్ ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. ఆసక్తి గల జర్నలిస్టులు తమ పిల్లల వివరాలను 98491 47350, 98482 91749కు తెలియజేయాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ విశాఖ జిల్లా యూనిట్ ఓ ప్రకటనలో కోరింది.

రౌడీ షీటర్‌పై కత్తితో దాడి

అల్లిపురం: రౌడీ షీటర్‌పై దాడి చేసిన ఘటన శనివారం రాత్రి మహారాణిపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మహారాణిపేట సీఐ వి. శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం తాడివీధికి చెందిన మాడుగుల కిరణ్‌కుమార్, అనిల్ ఇద్దరు టిఫిన్ కోసం ద్విచక్రవాహనంపై వెళ్లారు. టిఫిన్ తీసుకుని వస్తుండగా తాడివీధి వద్ద వినాయక నియజ్జనం ఊరేగింపు జరుగుతుంది. ద్విచక్ర వాహనంపై వస్తున్న కిరణ్‌కుమార్, అనిల్‌లను సురేష్, పెదభాను, చిన భాను, అభి అడ్డగించారు. పాత కక్షల కారణంగా వారు కూరగాయల కత్తితో దాడికి పాల్పడ్డారు. దాడిలో కిరణ్‌కుమార్ గాయపడ్డాడు.

ఈ విషయాన్ని రౌడీ షీటర్ సతీష్‌కు అనిల్ తెలియజేసి కిరణ్‌ను ఆస్పత్రికి తీసుకువెళ్లాడు. సతీష్ సంఘటన స్థలానికి చేరుకుని గొడవ జరిగిన విషయంపై ఆరా తీయగా వెంకటరమణ, ఆకుల ఉదయ్‌కుమార్ సతీష్‌పై చాకుతో దాడికి పాల్పడ్డారు. గాయపడి సతీష్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కిరణ్‌కుమార్, సతీష్ వేర్వేరుగా పోలీసులకు ఫిర్యాదు చేయగా ఆరుగురిపై కేసు నమోదు చేసి, ఐదుగుర్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరొకరు కోసం గాలిస్తున్నట్టు సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

హార్డ్‌వేర్ షాపులో అగ్ని ప్రమాదం

రూ. 30లక్షలు ఆస్తినష్టం

చోడవరం: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా హార్డ్‌వేర్ షాపు అగ్నిప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో సుమారు రూ.30 లక్షలు విలువైన ఆస్తినష్టం వాటిల్లింది. రావికమతం జంక్షన్‌లో దాచేపల్లి రామారావు (నానాజీ)కిచెందిన హార్డ్‌వేర్, పెయింట్స్ అమ్మకాలు చేసే రెండు అంతస్తుల దుకాణం ఆదివారం అగ్నిప్రమాదానికి గురైంది. షాపులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరగడంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. ఆ సమయంలో షాపు యజమాని నానాజీ షాపు మొదటి అంతస్తులో న్నారు. షాపులో మంటలు వేగంగా కమ్ముకోవడంతో ఆయన కేకలు వేశారు. పక్క షాపు వాళ్లు వెంటనే స్పందించి కిటికీ సాయంతో నిచ్చెన వేసి నానాజీని బయటకు తీసుకొచ్చారు. షాపులో ఉన్న పెయింట్స్, విద్యుత్ పరికరాలు, హార్డ్‌వేర్ సామాగ్రి ఈ ప్రమాదంలో కాలిపోయి పెద్ద మంటలు వ్యాపించాయి. సమీపంలో ఉన్న వారు వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. అయితే ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండి మంటలు చల్లారకపోవడంతో జిల్లా నలుమూలల నుంచి మూడు అగ్నిమాపక శకటాలు వచ్చి మంటలను అదుపు చేశాయి. సుమారు రూ. 30లక్షలు ఆస్తినష్టం ఉంటుందని అగ్నిమాపక అధికారులు చెప్పారు. కేసును నమోదు చేశారు.



షాపులో వ్యాపించిన మండలు

'వక్ఫ్ చట్టాన్ని సవరిస్తే ఊరుకోం'

తాటిచెట్లపాలెం: కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ చట్టానికి 41 సవరణలు చేసిందని.. దీని వల్ల ముస్లిం ఆస్తులు, ఆదాయానికి నష్టం వాటిల్లుతుందని ముస్లిం పెద్దలు, మేధావులు, అఖిల పక్ష నేతలు అన్నారు. వెంటనే ఈ సవరణ బిల్లును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైల్వే న్యూకాలనీలోని ఓ హోటల్‌లో అఖిల పక్ష నాయకులతో శనివారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముస్లిం కమ్యూనిటీ జిల్లా నాయకుడు షేక్ అబ్దుల్ మునీర్ మాట్లాడుతూ చట్టం తీసుకొచ్చి.. తమ పూర్వీకుల ఆస్తులపై తమకు హక్కులు లేకుండా చేయడం బాధాకరమన్నారు. వక్ఫ్ అనగా దానమని.. అల్లా పేరున 11వ శతాబ్దంలోనే చక్రవర్తులు ధనికుల ఇళ్ల స్థలాలను అల్లా పేరున వక్ఫ్ చేశారని గుర్తు చేశారు. దేశంలో సుమారు 9.4 లక్షల ఎకరాల సెంట్రల్ వక్ఫ్ బోర్డు ఆస్తులు ఉన్నాయని తెలిపారు. వీటిలో కొన్ని వేల ఎకరాలు ఆక్రమణలకు గురయ్యాయని చెప్పారు. ఇటీవల కేంద్రం ప్రవేశపెట్టిన వక్ఫ్ చట్ట సవరణ బిల్లును పార్లమెంటులో విపక్షాలు వ్యతిరేకించాయని తెలిపారు. ఈ బిల్లు వల్ల ముస్లిం సామాజిక వర్గానికి తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. సీపీఎం నాయకుడు అజయ్‌శర్మ, పీవోడబ్ల్యూ ప్రతినిధి లక్ష్మి, నాయకులు కత్తి పద్మ, మునీర్, అష్రాఫ్, హైదర్ అలీ సింకా పాల్గొన్నారు.



ముస్లింలకు సంఘీభావం తెలుపుతున్న నగర వామపక్ష, ముస్లిం నాయకులు